వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కృష్ణకాలనీ : ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య

కృష్ణకాలనీ, ఏప్రిల్ 8 : వేసవి దృష్ట్యా ప్రజలు, పిల్లలు, ఉద్యోగులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భూపాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కోణపాకల రాజయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో, హెచ్ఎంఆర్డీఎస్ పాఠశాల, భూపాలపల్లి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. చిన్నపిల్లలను వెంట పెట్టుకొని ప్రయాణం చేయొద్దని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించుకొని వడదెబ్బ నుంచి విముక్తి పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల : మండలంలోని బూర్నపల్లి గ్రామంలో వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం చిన్న పిల్లలు, బాలింతలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంజు ల, ఆశ వర్కర్ రజిత, అంగన్వాడీ టీచర్ రాణి, నేరెళ్ల రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

మహదేవపూర్ : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అంబట్‌పల్లి, సూరారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- పర్యవేక్షణాధికారి డాక్టర్ గోపి

ములుగు రూరల్ : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపి

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఏప్రిల్ 8 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తాగునీటి సరఫరా పర్యవేక్షణాధికారి, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి సూచించారు. ప్రతి ఇంటికీ తాగునీరందించేలా యుద్ధ ప్రాతిపదికన పని చేయాలన్నారు. సోమవారం భూపాలపల్లి, ములుగు కలెక్టరేట్లలో కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠితో కలిసి మిషన్ భగీరథ, ఇంట్రా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, మున్సిపల్, విద్యుత్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో తాగునీటి సరఫరాపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటి సరఫరా పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయి అధికారులను నియమించిందని, జిల్లా యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, రాష్ట్ర స్థాయి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లోని నీటి ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని, స్థానిక నీటి వనరుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా చేయాలన్నారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాగునీటి సరఫరాపై సమీక్షిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో నీటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, చేతి పంపులు, బోర్ వెల్స్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని, తాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు 24 గంటల్లోగా పునరుద్ధరించేలా చర్యలుండాలని గోపి సూచించారు. సమావేశాల్లో భూపాలపల్లి అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్, జడ్పీ సీఈవో జయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, ములుగు అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీవో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రజిత

గణపురం, ఏప్రిల్ 8 : వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ రజితారవీందర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి విధానపరమైన అంశాలను ఆమోదించకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, కోఆప్షన్ సభ్యులు చోటేమియా మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలను అధికారులు తీసుకోవాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే చోట వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వారు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలలోపు ఎలాంటి ప్రయాణాలు చేయొద్దని వైద్యాధికారిణులు అనూష, స్వాతి సూచించారు.

సమావేశంలో ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ మురళీధర్ రావు, ఎంపీటీసీలు పొనగంటి సుధర్మా మలహల్ రావు, కాలియ సాగర్, రాసపెల్లి లావణ్య, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్, మండల వ్యవసాయాధికారి దేశబోయిన ఐలయ్య, పశు వైద్యాధికారులు గంట పవన్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పీఆర్ ఏఈ నరేశ్, ఏపీవో రాజు, సీడీపీవో అవంతి, సూపర్ వైజర్ లక్ష్మి, ఏపీఎం ఇమామ్, ఏఈవోలు ప్రణయ్, మౌనిక, పంచాయతీ కార్యదర్శులు హరిచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అక్బర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

మహదేవపూర్ : ముందస్తు ఉగాది వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మహదేవపూర్, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జున్ను విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీ శ్రీనివాస్, పరశురాములు, మున్నయ్య, రజిత, డాక్టర్ రాజు, రాజేందర్, రమేశ్, మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకుమట్ల..

టేకుమట్ల : మండలంలోని వెలిశాల నవ చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంచకట్టుతో వచ్చి పంచాంగ పఠనం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్‌మధు, కరెస్పాండెంట్ కారుకూరి నారాయణ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సుమలత, ప్రియాంక, నితీష, నాగమణి, చైతన్య, చిరంజీవి, స్వరూప పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలివ్వండి

మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 8 : నూతనంగా ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం నుంచి రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉన్న చోట ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే సరిపోతుందని, సంబంధిత అధికారులు నివేదికలు అందజేయాలన్నారు. చిన్నారుల మరణాలపై వైద్య, మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఉపాధిహామీ బిల్లుల చెల్లింపు, వర్షాకాలంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర అంశాలపై ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన పనుల వివరాల నివేదికలు అందజేస్తే పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేస్తానని, రాబోయే వర్షాకాలంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, డీపీవో నారాయణరావు, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నిలిచిన ఇసుక లారీలు

రోడ్డుపై నిలిచిన ఇసుక లారీలు

గంట పాటు స్తంభించిన రాకపోకలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 8 : వాజేడు, వెంకటాపురం, మంగపేట, మణుగూరు ప్రాంతాల నుంచి ఏటూరునాగారం మీదుగా హైదరాబాద్, వరంగల్ వెళ్లే ఇసుక లారీలతో సోమవారం మధ్యాహ్నం ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఓ లారీ బ్యాటరీ పేలడంతో అక్కడే రోడ్డుపై నిలిచిపోయింది. దీనికి తోడు మంగపేట మార్గంలో మరొక లారీ రోడ్డుపై చెడిపోయింది. దీంతో రోడ్డుపై వందల సంఖ్యలో లారీలు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఏటూరునాగారం వై జంక్షన్ వరకు, మంగపేట రూటులో సుమారు వంద లారీల వరకు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మంచినీటి సమస్యలు తెలుసుకుంటున్న వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి

నీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

కృష్ణ కాలనీ, ఏప్రిల్ 8 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం 5, 6 వార్డుల్లోని కృష్ణకాలనీ, 27వ వార్డు జవహర్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో పాడైన బోర్లను మరమ్మతు చేయిస్తామని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులుంటే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల మౌనికా శ్రీనివాస్, బీఆర్ఎస్ 27వ వార్డు అధ్యక్షుడు శేఖర్, 5, 6, 27 వార్డుల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో వ్యక్తిపై కత్తితో దాడి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌లో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మార్కెట్‌లో చేపలు విక్రయించే నాగేంద్ర ప్రసాద్‌పై వంశీ అనే వ్యక్తి కత్తితో దాడిచేయగా అతడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు నాగేంద్ర ప్రసాద్‌ను ద్విచక్ర వాహనంపై చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆశోక్ ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. దాడి చేయటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాటారం, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేయడంతోపాటు అణగదొక్కే ప్రయత్నాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలుంటే అందులో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవడం విచారకరమని, కాంగ్రెస్ పూర్తిగా మాలల పార్టీగా మారిందని, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన కులస్తులకే ఎంపీ సీట్లు కేటాయిస్తున్నారని అన్నారు. ఒక కుటుంబానికి ఇప్పటికే రెండు ఎమ్మెల్యే పదవులున్నప్పటికీ మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చిందని ఆరోపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ఓటు వేయకుండా తిరుగుబాటు చేయాలన్నారు. మంతెన శ్రావణ్, కోరండ సాయికుమార్, చీపెల్లి చిన్న, సకినారపు సమ్మన్న, మంథని రాజబాబు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

మహదేవపూర్, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని తెలంగాణ వైన్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రోజులాగే నిర్వాహకులు ఆదివారం షాపు మూసివేసి ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 50 వేల నగదు అపహరించుకుపోయినట్లు నిర్వాహకుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

కాటారం, ఏప్రిల్ 8 : కాటారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ సోమవారం సందర్శించారు. ఎండ తీవ్రత కారణంగా ఉపాధి హామీ పనుల వద్ద, వరి కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని మెడికల్ ఆఫీసర్ మౌనికకు సూచించారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. అంతకు ముందు ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొని పలు రికార్డులను డీఎంహెచ్‌వో పరిశీలించారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ములుగురూరల్, ఏప్రిల్ 8 : సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు మంచి అలవాట్లను అలవర్చుకునేలా ప్రజలకు సిబ్బంది ఆరోగ్య సూత్రాలను తెలియజేయాలన్నారు. డెమో తిరుపతయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని వినతి

ములుగురూరల్, ఏప్రిల్ 8 : గిరిజన యూనివర్సిటీ కోసం ఇచ్చిన తమ భూములకు నష్టపరిహారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి సోమవారం బాధితులు వినతిపత్రం ఇచ్చారు. తమకు ఇప్పటి వరకు ఎలాం టి పరిహారం అందలేదని, అధికారులు ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, బాధితులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల, ఏప్రిల్ 8 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లగరిగె గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేసి 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఈ విషయమై వివరాలు సేకరించి జూకల్ గ్రామానికి చెందిన అమ్మకందారుడు సొడా కిషన్, వాహన డ్రైవర్ చిలపాక అంజిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం అమ్మకాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రవిచందర్‌పై చర్యలు తీసుకోవాలి

ములుగురూరల్, ఏప్రిల్ 8 : ములుగు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌ను దుర్భాషలాడిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవిచందర్‌ను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ బొజ్జా తారకం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు సేవ చేస్తున్న జగదీశ్వర్‌ను అవమానించడం సిగ్గుచేటన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే రవిచందర్‌పై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

విద్యార్థులు చదువులో ముందుండాలి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 8 : విద్యార్థులు చదువులో రాణించి అన్ని రంగాల్లో ముందుండాలని ఏటీడీవో దేశీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలలో ఇంటర్‌మీడియెట్ ప్రవేశ పరీక్షల్లో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలో సీటు సాధించిన పదో తరగతి విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆశ్రమ పాఠశాల నుంచి 17 మంది ప్రవేశ పరీక్ష రాయగా వారిలో 11 మంది విద్యార్థులకు కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీటు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు సావిత్రి, నాగరాజు, ఆనందరావు పల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు

ములుగురూరల్, ఏప్రిల్ 8 : అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన గుగులోత్ రతన్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాంగ్య(60) కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలిపారు. ఫిబ్రవరి 26న గ్రామంలో ఇంటి బాట కోసం బానోత్ రాజబాబు, అతని భార్య మంజుల, గుగులోత్ భాస్కర్, కిషన్, జ్యోతి, మంజి గాంగ్యతో గొడవ పడి దాడి చేశారు. అప్పటి నుంచి పలు దవాఖానల్లో చికిత్స పొందినా గాంగ్య ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

చిట్యాల, ఏప్రిల్ 8 : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గోపాలపూర్ శివారు వెంకటేశ్వరపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివకుమార్ (28) డెకరేషన్ పని నిమిత్తం తన ఇంటి నుంచి కర్కపల్లి గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో వెంకటేశ్వరపల్లి సమీపంలోని మొండికుంట వద్ద బైక్ అదుపుతప్పి పడిపడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wardens (Female)-4, Telecallers-2, Attractive Salary for deserved candidates. Contact: SUVIDYAA Jr. College, for girls, Nakkalagutta, HNK, Cont: 8885599155, 8885599166, NTW-323235

CHANGE OF NAME

★I, SADANANDAM MIYYAPURAM, R/o. 2-50, Tekumatla, Jayashankar Bhupalpally-506 356, T.S. Changed My Name as SADANANDAM MIYAPURAM, S/o. Miyapuram Shankaraiah. NT-328970

★I, HARISH KUMAR MIYYAPURAM, R/o. 2-50, Tekumatla, Jayashankar Bhupalpally-506 356, T.S. Changed My Name as MIYAPURAM HARISH KUMAR, S/o. Sadanandam Miyapuram. NT-328970

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 8 : బాధితులు అందజేసిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 12 మంది బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను తెలియజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతున్నదని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయదారుల బైండోవర్

ఏటూరునాగారం, ఏప్రిల్ 8 : ఏటూరునాగారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గుడుంబా విక్రయిస్తున్న 15 మందిని ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. గతంలో ప్రస్తుతం కేసులు నమోదైన వెంకటాపురం మండలం మొర్రవానిగూడెం, పాత్రాపురం, వెంకటాపురం, బెస్తగూడెం, మంగపేట మండలం కోమటిపల్లి, చుంచుపల్లి, బోరునర్సాపూర్, ఏటూరునాగారం మండలం ముల్లకట్ట గ్రామాలకు చెందిన 15మందిని తహసీల్దార్ల ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. ఇక ముందు గుడుంబా తయారు చేసినా, విక్రయించినా బైండోవర్ నిబంధనలు అధిగమించిన వారికి రెండేళ్ల జైలు, రూ. 2లక్షల జరిమానా విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి



శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

ములుగురూరల్, ఏప్రిల్ 8 : ములుగు మండలం మల్లంపల్లి గ్రామ పశువైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి(36) గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన శ్రీధర్‌రెడ్డి హనుమకొండలోని తన ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుండెపోటుకు గురి కాగా కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే క్రమంలో ఆయన మృతి చెందాడు. కాగా, శ్రీధర్‌రెడ్డి మల్లంపల్లి పశువైద్యాధికారిగా, జీపీ స్పెషల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 8 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సోమవారం తహసీల్దార్ వీరభద్రప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఆదివారం రాత్రి మండలంలోని చొక్కల గ్రామ సమీపంలోని గోదావరి ఇసుక పాయ నుంచి జేసీబీ సాయంతో నాలుగు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకొని రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

వాజేడు కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు!

- పార్టీ మండల అధ్యక్షుడిగా డెనార్జునరావు
- నియమక పత్రం అందజేసిన డీసీసీ జిల్లా అధ్యక్షుడు వీరయ్య
- భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావును కలిసిన మండల మాజీ అధ్యక్షుడు

భద్రాచలం ఏంఎల్‌ఏ వెంకట్రావును కలిసిన మాజీ అధ్యక్షుడు సీతారామరాజు (వాసు), కాంగ్రెస్ నాయకులు

వాజేడు, ఏప్రిల్ 8 : భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేరికతో వాజేడు మండల కాంగ్రెస్‌లో గ్రూప్ వార్‌కు తెరలేపినట్లుయింది. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య మండల పర్యటన రోజే పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజు (వాసు) వర్గం నేతలు ఎమ్మెల్యే తెల్లంను కలిశారు.

సోమవారం జగన్నాథపురం గ్రామానికి చెందిన బొల్లె డెనార్జునరావును మండల అధ్యక్షుడిగా నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు పొదెం ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటనకు మండల మాజీ అధ్యక్షుడి వర్గం దూరం

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య మండల పర్యటనకు వచ్చారు. ఇదే రోజున పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజు(వాసు) వర్గం నాయకులు పర్యటనకు హాజరుకాకుండా భద్రాచలం వెళ్లి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషిచేసిన తనను కాదని కొత్తగా వచ్చిన వారికి మండల అధ్యక్ష పదవి కట్టబెట్టడంపై వాసు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మండలంలో ఓట్ల శాతం పెంచేందుకు కృషిచేసిన దంతులూరి విశ్వనాథప్రసాదరాజుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే తెల్లం అత్యంత సన్నిహితులు కావడం, వీరంతా గతంలో వైఎస్ఆర్‌సీపీలో పనిచేయడంతో ఆయన వర్గం కూడా తెల్లం వెంటే ఉంటారని సమాచారం. ఇదే జరిగితే మండలంలో వర్గపోరు తప్పేటట్లు లేదని తెలుస్తున్నది. పొదెం రాక సందర్భంగా మాజీ అధ్యక్షుడి వర్గానికి తెలియకుండా గోప్యంగా ఉంచడమే గ్రూప్ వార్‌కు తెరలేపినట్లు సమాచారం. దీంతో ఈ వర్గం వారు తమ బలాన్ని చూపించేందుకు 15కార్లలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కలిసినట్లు సమాచారం. దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు లేదా కాకర్లపూడి విక్రాంత్‌ను మండల అధ్యక్షుడిగా నియమించాలనేది వీరి ప్రతిపాదనగా తెలుస్తున్నది.

న్యాయం కోసం నేరుగా కలువొచ్చు

ములుగు ఎస్పీ శబరీశ్

బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ములుగురూరల్, ఏప్రిల్ 8 : స్థానిక పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరుగకుంటే బాధితులు తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చునని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులో వాస్తవం ఉంటే తప్పక న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

పోలీస్ అధికారులతో ఐజీ వీసీ

ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ సైకో ట్రోపిక్ సబ్స్టాన్సెస్) కేసులపై మల్టీ జోన్ ఐజీ రంగనాథ్ సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ములుగు నుంచి ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేసి 756 కిలోల గంజాయి పట్టుకొని ధ్వంసం చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఎస్పీ చర్చిస్తూ డ్రగ్స్‌లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. వీసీలో ఏటూరునాగారం ఏఎస్పీ గితేమహేశ్ బాబా సాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు శ్రీధర్, రాజు, శంకర్, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, కమలాకర్, కృష్ణప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.